ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.4 ; కనిష్ఠం 20.2



'ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అదనపు గదులు నిర్మించాలి'

కామారెడ్డి టౌన్, జూలై 16: కామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అదనపు గదులను వెంటనే నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముదాం అరుణ్ అన్నారు. కళాశాలలో సుమారు 500 మందికి పైగా విద్యార్థులు ఉంటే కనీసం 10 తరగతి గదులు కూడా లేవని ఇంటర్మీడియట్ రెగ్యులర్ కోర్సులతో పాటు ఒకేషనల్ కోర్సులు కూడా ఉండడంతో అడ్మిషన్‌లు పెరిగాయని అన్నారు. గతంలో ప్రజాప్రతినిధులకు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదని వెంటనే గదుల నిర్మాణం చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మణికంఠ, నాయకులు రాహుల్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



రేపటి నుంచే.. రైతు రుణమాఫీ!

- రైతుల రుణఖాతాలో జమకానున్న డబ్బులు
- ఇప్పటికే మార్గదర్శకాలను జారీ చేసిన ప్రభుత్వం
- బ్యాంకర్లకు స్పష్టమైన ఆదేశాలు
- జిల్లాలో సుమారు 1.20లక్షల రైతులకు లబ్ధి చేకూరే అవకాశం
- రుణమాఫీకి పట్టా పాసుపుస్తకం ప్రామాణికం

కామారెడ్డి, జూలై 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు రైతు రుణమాఫీని అమలు చేస్తూ తన హామీని నెరవేర్చుకునే పనిలో పడింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రైతుల రుణాలను మాఫీ చేసేందుకు ఇప్పటికే మార్గదర్శకాలను జారీ చేయగా ఈనెల 18 నుంచి రుణమాఫీ అమలులోకి తీసుకురానుంది. గురువారం నుంచి రైతుల రుణఖాతాలో రుణమాఫీ నిధులను ప్రభుత్వం జమ చేయనుంది. రుణమాఫీ నిధులు పక్కదారి పట్టకుండా బ్యాంకర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో నిర్వహించిన జిల్లా కలెక్టర్ల సదస్సులో రుణమాఫీ నిధులు జమ చేయడంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం 2 లక్షల వరకు రుణాలు తీసుకున్న రైతులకు మాఫీ చేయనుంది. అయితే గురువారం నుంచి లక్ష రూపాయల వరకు ఉన్న రుణాలు మాఫీ చేయనున్నట్లు సమాచారం. రుణ మాఫీతో జిల్లాలో సుమారు 1.20లక్షల మంది రైతులకు రుణాలు మాఫీ అవుతాయని సంబంధిత శాఖాధికారులు చెబుతున్నారు.

ఇప్పటికే మార్గదర్శకాలను జారీ చేసిన ప్రభుత్వం

రైతుల రుణమాఫీకై రాష్ట్ర ప్రభుత్వం రెండ్రోజుల కిందటే మార్గదర్శకాలను జారీ చేసింది. 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9 వరకు తీసుకున్న పంట రుణాలను మాఫీ చేయనున్నట్లు ప్రకటించింది. 2023 డిసెంబరు 9 నాటికి అసలు, వడ్డీ కలిపి రూ.2లక్షల వరకు మాఫీ కానుంది. రేషన్‌కార్డు, పట్టా పాస్‌బుక్ ప్రామాణికంగా తీసుకుని కుటుంబానికి రూ.2లక్షల లోపు రుణాన్ని మాఫీ చేయనున్నారు. రూ.2లక్షల కన్న ఎక్కువ రుణం ఉంటే ఎక్కువగా రుణ మొత్తాన్ని ముందుగా బ్యాంక్‌కు చెల్లించాల్సి ఉంటుంది. రీ షెడ్యూల్ చేసిన రుణాలు, దీర్ఘకాలిక రుణాలకు రుణమాఫీ వర్తించదని ప్రభుత్వం ప్రకటించింది. రుణమాఫీపై రైతులకు ఉన్న సందేహాలను తీర్చేందుకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేస్తామని, వివరాల కోసం వెబ్ పోర్టల్ కానీ మండల సహాయ కేంద్రాల్లో కానీ సంప్రదించవచ్చని వ్యవసాయ శాఖ పేర్కొంది. ఆగస్టు 15వ తేదీలోపు రూ.2లక్షల రుణమాఫీ ప్రక్రియ పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది.

పట్టా పాస్‌పుస్తకం ప్రామాణికం

రైతు రుణమాఫీకి ప్రభుత్వం రేషన్‌కార్డుతో పాటు పట్టా పాసుపుస్తకాన్ని ప్రామాణికంగా తీసుకోనున్నారు. అయితే రేషన్‌కార్డు లేని వారికి రుణమాఫీ కాదని జరుగుతున్న ప్రచారంపై సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టత ఇచ్చారు. రుణమాఫీకి రైతు పట్టాపాసు పుస్తకమే ప్రామాణికమని రేషన్‌కార్డు కేవలం కుటుంబ సభ్యుల నిర్ధారణ కోసమేనని చెప్పుకొచ్చారు. పట్టా పాసుబుక్ ఉండి రుణాలు తీసుకున్న వారందరికీ రూ.2లక్షల లోపు మాఫీ చేయనున్నారు.

రుణ లబ్ధిదారుల్లో ఆనందం

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రైతుల పంట రుణాలు మాఫీ చేసేందుకు చర్యలు చేపట్టింది. రూ.2లక్షల పంట రుణాలు మాఫీ చేసేందుకు మార్గదర్శకాలను జారీ చేయడంతో పాటు ఈనెల 18 నుంచి లక్ష వరకు రుణాలు తీసుకున్న రైతుల ఖాతాలో ప్రభుత్వం నిధులు జమ చేయనుంది. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీపై తీసుకున్న నిర్ణయంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 18 సాయంత్రంలోగా లక్ష రూపాయల వరకు రుణమాఫీ చేయనున్నారు. అదేరోజు రైతువేదికల్లో రుణమాఫీ లబ్ధిదారులతో సంబరాలు నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఆదేశించారు. ఈ సంబరాలకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు.

నిరీక్షణ!

- పెన్షన్ కోసం ఎదురు చూపులు
- మండల కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు
- పెండింగ్‌లో 463 దరఖాస్తులు
- కొత్త ప్రభుత్వమైనా స్పందించాలని వేడుకోలు

వితంతువులు, దివ్యాంగులు పెన్షన్ కోసం ఏళ్లుగా నిరీక్షిస్తున్నారు. మండల కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేదని వాపోతున్నారు. ఇక దివ్యాంగుల విషయంలో సదరం క్యాంపుల నుంచి సర్టిఫికెట్ తెచ్చుకున్న ప్రభుత్వ వెబ్‌సైట్ ఓపెన్ కాలేదని చెబుతున్నారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం అయినా పెన్షన్ మంజూరు చేయాలని వేడుకుంటున్నారు.

ఎల్లారెడ్డి, జూలై 16 : ఎల్లారెడ్డి మండలంలోని 31 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో మొత్తం 3,562 పెన్షన్లు ఉన్నాయి. ప్రతినెలా ప్రభుత్వం రూ.2,116 లు పెన్షన్ అందిస్తోంది. ప్రతీనెల వివిధ గ్రామాల్లో వివిధ కారణాల వల్ల భర్తలు చనిపోవడంతో భార్యలు, వితంతువులు అవుతున్నారు. ఇంటికి పెద్ద దిక్కు కోల్పోవడంతో కుటుంబ పోషణ భారం భార్యలపై పడుతోంది. దీంతో పిల్లల చదువుల భారంతో పాటు కుటుంబ పోషణ వితంతువులకు కష్టంగా మారుతోంది. కొంత మంది చిన్న వయసులోనే భర్తను కోల్పోయి ఒంటరి జీవితాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో వితంతువులకు పెన్షన్ రాక అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కొక్కరు నాలుగైదు ఏళ్ల నుంచి పెన్షన్ కోసం ఎదురు చూస్తున్నారు. పలుసార్లు మండల కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేకపోయిందని అంటున్నారు. కొంత ఆర్థికంగా ఉన్న వారి పరిస్థితి బాగున్నా పేద వితంతువుల పరిస్థితి దారుణంగా మారింది.



ఎల్లారెడ్డి మండల ప్రజా పరిషత్ కార్యాలయం

పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు ఇవే..

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వితంతువులు, దివ్యాంగులు, వివిధ రకాల అర్హులైన పెన్షన్‌దారులు ఇప్పటి వరకు మండల కార్యాలయంలో సుమారు 312 మంది దరఖాస్తులు చేసుకున్నారు. నేటికీ ఏ ఒక్కరికి కూడా పెన్షన్ మంజూరు కాలేదు. ప్రతీనెల దివ్యాంగులు సదరం క్యాంపునకు వెళ్లి అర్హత సర్టిఫికెట్ తెచ్చుకున్నా సంబంధిత పెన్షన్ సైట్ ఓపెన్ కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంట్లో పెన్షన్ తీసుకుంటున్న వ్యక్తి చనిపోతే ఆ స్థానంలో కుటుంబ సభ్యుల్లో అర్హులైన ఒకరికి అందిస్తున్నారు. కొత్త పెన్షన్లు అందించడం లేదు.

పెన్షన్ అందించాలి

● స్వరూప, బాధితురాలు

నా భర్త అనారోగ్యం బారిన పడి రెండేళ్ల క్రితం మృతి చెందాడు. ఇంటికి పెద్ద దిక్కు కోల్పోవడంతో పిల్లల కుటుంబ పోషణ భారంగా మారింది. పెన్షన్ వస్తే కొంత ఆశగా ఉంటుందని భావిస్తే రెండేళ్ల నుంచి రావడం లేదు. ప్రభుత్వం పెన్షన్లు మంజూరు చేయాలి.

దరఖాస్తులు తీసుకుంటున్నాం

● ప్రకాష్, ఇన్‌చార్జి ఎంపీడీవో, ఎల్లారెడ్డి

కొత్త పెన్షన్ల కోసం ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. మండలంలోని వివిధ గ్రామాల వారు దరఖాస్తులు ఇస్తే తీసుకుంటున్నాం. ప్రభుత్వం పెన్షన్ లాగిన్‌ను ఓపెన్ చేస్తే నమోదు చేస్తాం. ఇదే విషయాన్ని ఉన్నతాధికారులకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం.


హైదరాబాద్‌లో నిర్వహించిన సీఎం సమీక్షా సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ సింధూశర్మ

కలెక్టర్లకు సీఎం దిశా నిర్దేశం

కామారెడ్డి టౌన్, జూన్ 16 : రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అమలుపర్చాల్సిన పలు అంశాలపై మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల ఆధ్వర్యంలో నిరహించిన సమీక్షా సమావేశాన్ని జిల్లా కలెక్టర్ అశిష్ సంగ్వాన్, ఎస్పీ సింధూశర్మలు హాజరయ్యారు. ఈ సందర్భంగా 9 అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. ఈ నెల 18 నుంచి అమలు చేయాల్సిన రైతు రుణమాఫీ, అటవీ సంరక్షణ, వన మహోత్సవ కార్యక్రమం, పాఠశాలలు, ఆస్పత్రుల్లో కల్పించాల్సిన సౌకర్యాలు, శాంతి భద్రతలపై సలహాలు, సూచనలు అధికారులకు అందించారు.

సమన్విత ఆసుపత్రి సీల్ తొలగించేందుకు మధ్యంతర ఉత్తర్వులు

కామారెడ్డిటౌన్, జూలై 16: కామారెడ్డి పట్టణంలోని సమన్విత ఆసుపత్రికి వేసిన సీల్‌ను ఓపెన్ చేయాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిందని డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసుపత్రిలో అక్రమ కార్యకలపాలు జరుగుతున్నందున, లింగనిర్ధారణ పరీక్షలు, అబార్షన్లు చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పీసీపీఎన్‌డీటీ యాక్ట్ ప్రకారం ఆసుపత్రిని మూసివేసినట్లు తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు సీల్ తొలగించుటకు తగు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు.

సీజనల్ వ్యాధుల.. భయం

కామారెడ్డి టౌన్/బాన్సువాడ టౌన్, జూలై 16: సీజనల్ వ్యాధులతో రోజురోజుకూ జిల్లా ప్రజలు హడలెత్తిపోతున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ ప్రజలు శ్రద్ధ చూపకపోవడం వల్లనో లేదా క్షేత్రస్థాయి అధికారుల అలసత్వం వల్లనో దోమలు, ఈగలు పెరిగిపోయి వ్యాధుల భారినపడుతూ జిల్లా ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గత కొద్ది రోజులుగా అక్కడక్కడ వర్షాలు పడుతున్నాయన్న సంబరం కంటే జ్వరాలు సోకుతున్నాయనే ఆందోళనే ప్రజల్లో ఎక్కువగా కనబడుతోంది. ప్రస్తుతం పాలకవర్గాల పదవి కాలం ముగియడంతో సమస్యను లేవనెత్తే వారు లేక గ్రామీణ ప్రాంతాల్లో అంతంత మాత్రంగానే పారిశుధ్య కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. దీంతో దోమలు, ఈగల సంతతి పెరిగిపోయి వ్యాధులు మొదలవుతున్నాయి. ఈ వ్యాధుల వల్ల ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల వద్ద జనం క్యూ కడుతున్నారు. పలు ప్రైవేట్ ఆసుపత్రులలో మలేరియా, డెంగ్యూ భారిన పడి చికిత్స పొందుతున్నారని సమాచారం. సీజనల్ వ్యాధుల పుణ్యమా అని ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని ప్రైవేట్ ఆసుపత్రులు దోచుకుంటున్నాయి. డెంగ్యూ వ్యాధి లక్షణాలు కనిపిస్తే ప్రైవేట్ ఆసుపత్రులు సైతం ఎన్ఎస్-1, ఎలిసాటెస్ట్‌లకు టీహబ్‌కు నిర్ధారణ కోసం పంపించాలని వైద్య ఆరోగ్య శాఖాధికారులు సూచిస్తున్నా ఎక్కడ అది అమలు అయినట్లు కనిపించడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

భయపెడుతున్న డెంగ్యూ, మలేరియా

ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోవడం, ఖాళీ స్థలాల యజమానులు తమ స్థలాల్లో పేరుకపోయిన చెత్తను, పిచ్చిమొక్కలు, నీటి నిల్వలపై దృష్టి సారించకపోవడంతో జిల్లాలో దోమకాటు ద్వారా వచ్చే వ్యాధులు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. పలు చోట్ల రహదారులు కోతకు గురై గుంతలు ఏర్పడి నీరు నిల్వడంతో దోమలు వృద్ధి చెంది పగలు రాత్రి అనే తేడా లేకుండా కుడుతూ కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇప్పటి వరకు జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం 7 వరకు డెంగ్యూ కేసులు నమోదు అయ్యాయి. కానీ అనధికారికంగా ఈ కేసుల సంఖ్య ఎక్కువగానే ఉంది. సీజనల్ జ్వరాలన్నింటిలోనూ ఎక్కువగా మలేరియా, డెంగ్యూ వ్యాధుల వల్ల భయానక పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఏ చిన్న జ్వరం వచ్చినా డెంగ్యూ, మలేరియా కేసులే అనుకుంటున్నా జనం అప్పుచేసి మరీ చికిత్సను చేయించుకుంటున్నారు. డెంగ్యూ భయం జనంలో ఉండడంతో ఇదే అదనుగా భావించిన ప్రైవేట్ ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్ల నిర్వాహకులు ప్లేట్‌లెట్స్ తగ్గాయంటూ ప్రజలు నుంచి డబ్బులను దోచుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏలిసా పరీక్ష ద్వారా డెంగ్యూ నిర్ధారణ పరికరాలను ఏర్పాటు చేయడంలో, ప్రైవేట్ దోపిడీకి అడ్డుకట్ట వేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. కేవలం టీహబ్‌లో మాత్రమే పరికరాలు అందుబాటులో ఉన్నాయని జిల్లా, అన్ని ఏరియా ఆసుపత్రుల్లోనూ అందుబాటులోకి తీసుకురావడంతో పాటు డెంగ్యూ భారిన పడిన వారికి చికిత్స నిమిత్తం తగిన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


గాంధారిలో ఇంటి పరిసరాల్లో చిత్తడిగా ఉన్న దృశ్యం

ఆసుపత్రిలో చేరాల్సింది ఎప్పుడంటే..

సాధారణంగా డెంగ్యూ జ్వరం వచ్చిన వారిలో 80 శాతం మందికి ఎలాంటి ప్రత్యేక చికిత్స అవసరం లేకుండానే తగ్గిపోతోంది. కేవలం 20 శాతం మందిలో మాత్రమే ఆస్పత్రిలో చేరి చికిత్స పొందాల్సి వస్తోంది. ఆస్పత్రిలో చేరిన వారిలో 50 శాతం వరకు డెంగ్యూ లక్షణాల ఆధారంగా చికిత్స అందించడం జరుగుతోంది. అవి ఫ్లూయిడ్స్ వంటి వాటితోనే నయమవుతుంది. ఇక మిగిలిన 30 శాతం మాత్రం శరీరంపై మచ్చలాంటి లక్షణాలు, మరో 20శాతం శరీరం నుంచి అంతర్గతంగా రక్తస్రావం జరుగుతోంది. ఇలా రక్తస్రావం అవుతున్న జ్వర పీడితులకు మాత్రమే ప్లేట్‌లెట్స్ ఎక్కించాల్సి వస్తోంది. జ్వరం వచ్చి తగ్గిపోయాక నాలుగు రోజుల తర్వాత రక్తంలో ప్లేట్‌లెట్స్ తగ్గిపోయే ప్రమాదం ఉంటుంది. ఒక్కోసారి ప్లేట్‌లెట్స్ సంఖ్య లక్షల్లో ఉన్నది కాస్తా తర్వాత రోజుకు 30 వేలకు పడిపోవచ్చు. ఇలాంటి అనూహ్యమైన పరిస్థితుల్లో తప్పా మామూలుగా అయితే 15 వేలకు పడిపోయినా తిరిగి ప్లేట్‌లెట్స్ ఎక్కించాల్సిన అవసరం లేదు. అంతకంటే తక్కువగా తగ్గితేనే అవసరమవుతాయని నిపుణులైన వైద్యులు చెబుతున్నారు. అంతేకాకుండా ప్లేట్‌లెట్స్ తగ్గడం అనేది చిన్న చిన్న వైరల్ ఫీవర్‌లోని ఉంటాయని అంటున్నారు.

- వర్షాకాలంలో వ్యాధులతో సమరం
- వాతావరణ మార్పులతో దోమల విజృంభణ
- భయపెడుతున్న డెంగ్యూ, మలేరియా
- ఇప్పటి వరకు 7 డెంగ్యూ కేసుల నమోదు
- ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగులు పెడుతున్న జనం
- ఎన్ఎస్-1, ఎలిసాటెస్ట్ తర్వాతే నిర్ధారించాలంటున్న వైద్యఆరోగ్య శాఖ

డెంగ్యూ నిర్ధారణ పరికరాలు కరువు

అసలు సాధారణ జ్వరాలు, వైరల్ ఫీవర్‌లు ఏవో డెంగ్యూ వ్యాధి ఏదో నిర్ధారించే ఎన్ఎస్-1, ఎలిసాటెస్ట్ పరికరాలు టీహబ్‌లో తప్ప ప్రైవేట్ ఆసుపత్రులలో ఎక్కడా లేవని వైద్య ఆరోగ్య శాఖధికారులే పేర్కొంటున్నారు. డెంగ్యూ వ్యాధి లక్షణాలు, డెంగ్యూను ఏ రకంగా నిర్ధారణ చేస్తారనేది వివరించడంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది విఫలమవుతుండడంతో ప్రజలు చిన్న పాటి జ్వరానికి సైతం డెంగ్యూగా భావించి ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ఈ భయాన్ని అందిపుచ్చుకొని ప్రైవేట్ ఆసుపత్రులు చేస్తున్న మాయకు అప్పులు చేసి చికిత్స చేయించుకుంటున్నారు. జ్వరం రాగానే డాక్టర్ల దగ్గరకు పరుగెడుతున్న జనానికి వివిధ పరీక్షలు చేయిస్తున్న డాక్టర్లు ప్లేట్‌లెట్స్ తగ్గాయని చెప్పి ఆసుపత్రిలో అడ్మిట్ చేసుకొని చికిత్సలు అందిస్తూ వేలకు వేలు డబ్బులు ఖర్చులు చేయిస్తున్నారు. అసలు ప్రైవేట్ ఆసుపత్రులలో డెంగ్యూ నిర్ధారణ పరికరాలనేవి లేవని ఎవరికైన డెంగ్యూ లక్షణాలు కనిపిస్తే ఖచ్చితంగా టీహబ్‌కు పరీక్షల నిమిత్తం పంపించాలని ప్రైవేట్ ఆసుపత్రులకు సూచించామని వైద్య ఆరోగ్యశాఖాధికారులు చెబుతున్నారే తప్ప అందుకు తగిన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని తెలుస్తోంది.



దర్యాపూర్ తండాలో పూజలు నిర్వహిస్తున్న గిరిజనులు

తండాల్లో ఘనంగా శీతల్ పండుగ

నవీపేట, జూలై 16: మండల కేంద్రంలోని దర్యాపూర్ తండాలో మంగళవారం గిరిజనులు శీతల్ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భవానీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు బాగా కురియాలని, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని అమ్మవారికి ప్రసాదాన్ని సమర్పించారు. అనంతరం గిరిజన మహిళలు ఆటపాటలతో నృత్యం చేశారు.

● బట్టాపూర్‌లో..

ఏర్గట్ల: మండలంలోని బట్టాపూర్ గ్రామంలో మంగళవారం గిరిజనులు శీతల పండుగలను ఘనంగా జరుపుకున్నారు. గిరిజనుల ఆరాధ్య దేవతలైన అమ్మవార్లకు ఊరేగించి నైవేద్యం సమర్పించారు. వర్షాలు బాగా కురుసి పంటలు పండాలని, అందరూ అయురారోగ్యాలతో ఉండాలని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో భూక్య తిరుపతి నాయక్, భీమా నాయక్, శివ, అంజి, శ్రీనివాస్, రమేష్, శ్రీధర్, నారాయణ, గిరిజనులు పాల్గొన్నారు.

● వివేక్‌నగర్‌తండా, నల్లగుట్టతండాలో..

జక్రాన్‌పల్లి: మండలంలోని వివేక్‌నగర్ తండా, నల్లగుట్టతండాల్లో మంగళవారం శీతల్ పండగను ఇరు గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ రెండు గ్రామాల్లో గిరిజన మహిళలు, యువతులు కొత్త బట్టాలు ధరించి నైవేద్యాలు ఎత్తుకొని ఊరేగింపుగా జగదాంబ ఆలయాలకు చేరుకున్నారు. అనంతరం నైవేద్యాలు వేసి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. వర్షాకాల వర్షాలు కురువాలని, చెరువులు నిండాలని, పంటలు పండాలని ప్రత్యేకపూజలు చేసి వేడుకున్నారు. అనంతరం కుటుంబసభ్యులతో కలిసి వనభోజనాలు వెళ్లారు. కార్యక్రమంలో గిరిజననాయకులు జితేందర్‌నాయక్, సంతోష్‌నాయక్ గ్రామస్థులున్నారు.



బట్టాపూర్‌లో పూజలు నిర్వహిస్తున్న గిరిజనులు

ఆర్‌వోబీ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

డిచ్‌పల్లి, జూలై16: మండలంలోని బర్దిపూర్ శివారులోని మాధవనగర్ ఆర్‌వోబీ పనులను మంగళవారం సాయంత్రం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. వంతెన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పనుల ఆలస్యంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామీణ ప్రజలు, నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో 8నెలల జైలు శిక్ష

ఎడపల్లి, జూలై 16: మండలంలోని మంగల్‌పాడ్ గ్రామంలోని పలు దేవాలయాల్లో వరుస దొంగతనాలు చేసిన వక్తికి మంగళవారం బోధన్ కోర్టు అదనపు న్యాయాధికారి సాయిశివ 8నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. అదనపు ప్రాసిక్యూటర్ చిదరాల రాణి తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రలోని బిలోలి తాలూకా కొండల్‌వాడీ గ్రామానికి చెందిన జిత్తేవార్ గణేష్ అలియాస్ నర్సింలు ఎడపల్లి మండలంలోని మంగల్‌పాడ్ గారమంలోని బాలత్రిపురసుందరీ అమ్మవారి ఆలయం, గ్రామ శివారులోని చెరువు కట్టపై ఉన్న గంగమ్మతల్లి ఆలయాల్లో చోరీకి పాల్పడ్డాడినట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన కుంట శ్రీనివాస్ ఏప్రిల్ 14న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసినట్లు ఎస్సై తెలిపారు. చోరీకీ పాల్పడ్డ వ్యక్తి ఎడపల్లి బస్‌స్టాండు వద్ద అనుమానాస్పందంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకుని నిందితుడిని కోర్టులో హాజరుపరుచగా నేరాలకు సంబంధిచిన సాక్ష్యాధారాలను పరిశీలించిన తర్వాత నేరం రుజువు కావడంతో న్యాయాధికారి 8నెలల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

'అమ్మమాట.. అంగన్‌వాడీ బాట' అవగాహన ర్యాలీ

కమ్మర్‌పల్లి, జూలై16: కమ్మర్‌పల్లి సెక్టార్ పరిధిలోని ఉప్లూర్ గ్రామంలో మంగళవారం స్థానిక అంగన్‌వాడీ సెంటర్ల నిర్వాహకులు అమ్మ మాట అంగన్‌వాడీ బాట అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సెంటర్లలో చేరిన పిల్లలకు ఆటపాటలతో విద్యాబోధన, ప్రతీరోజు పౌష్టికాహారం, అంగన్‌వాడీ సెంటర్ల పరిధిలోని తల్లుకు ప్రతీరోజు పౌష్టికాహారం సదుపాయాలును వివరిస్తూ అవగాహనర్యాలీ నిర్వహించారు. తమ పిల్లలను సమీప అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. ర్యాలీలో ఐకేపీ సీఏలు, వైద్యఆరోగ్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్‌లు, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, సరిత, లక్ష్మీశారద ఉన్నారు.

'పోరాటాల ఫలితమే వేతనాల విడుదల'

డిచ్‌పల్లి, జూలై 16: పోరాటాల ఫలితంగానే పంచాయతీ కార్మికుల పెండింగ్ జీతాలు విడుదల సాధ్యమైందని, జూలై 5న రాష్ట్రవ్యాప్తంగా ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేయడంతో ప్రభుత్వం దిగి వచ్చిందని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు మురళి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 12వరకు హామీ ఇచ్చారని, ఈ కారణంగానే ధర్నా విరమించానట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు రాజేందర్, నర్సయ్య, సుమన్, బుచ్చయ్య, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ వన్‌టైం బ్యాక్‌లగ్ పరీక్షల్లో పది మంది విద్యార్థుల గైర్హాజరు

డిచ్‌పల్లి, జూలై16: టీయూ పరిధిలోని డిగ్రీబ్యాక్‌లగ్ వన్‌టైం పరీక్షలు మంగళవారం 15వరోజు ప్రశాంతంగా జరిగినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. అనుబంధ కళాశాల పరిధిలో ఉదయం జరిగిన పరీక్షకు 19మంది విద్యార్థులకు 17మంది హాజరయ్యారని, ఇద్దరు గైర్హాజరయ్యరని చంద్రశేఖర్ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 107మంది విద్యార్థులకు 99 పరీక్షకు హాజరయ్యారని, 8 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు.

'కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టాలి'



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందిస్తున్న వీఆర్ఏలు

డిచ్‌పల్లి, జూలై16: 11 నెలలు గడిచినా వీఆర్ఏ వారసులకు రాష్ట్ర ప్రభుత్వం జీవో ఉత్తర్వులు జారీచేయలేదని, వెంటనే 81జీవోను ప్రభుత్వం అమలు చేయాలని ఖాళీగా ఉన్న కారుణ్య నియామకాలను చేపట్టాలని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి కి వీఆర్ఏల జేఏసీ ప్రతినిధులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. 61 పైబడిన వీఆర్ఏ వారసులకు కారుణ్య నియామకాలు చేపట్టేందుకు నూతన జీవో ద్వారా అవకాశం కలిగిందని, కానీ ఇంతవరకు నియామక ఉత్తర్వులు జారీ చేయలేదని అన్నారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని వీఆర్ఏ ప్రతినిధులకు రూరల్ ఎమ్మెల్యే హామీ ఇచ్చారని పేర్కొన్నారు.



మున్సిపల్ ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

రాజకీయాలకు అతీతంగా ఆర్మూర్ అభివృద్ధి

● ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, జూలై16: ఆర్మూర్ నియోజకవర్గాన్ని రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయం ముఖద్వారాన్ని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ విలీన గ్రామాల సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి నిధులు మంజూరు చేయాలని కోరుతానన్నారు. పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల మంత్రులు కలిసి ఆర్మూర్ అభివృద్ధికి నిధులు మంజూరుకు నివేదిస్తామన్నారు. పట్టణంలో అక్రమణలు, కబ్జాలు పాల్పడితే సహించేదిలేదని, రౌడీయిజం ఉండకూడదని ఎమ్మెల్యే హెచ్చరించారు. కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా అభివృద్ధిలో ముందుకు సాగుతామన్నారు. అభివృద్ధిలో అంగడిబజార్‌లోని మార్కెట్‌ను పరిశీలించారు. రైతులు తమ కూరగాయల వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించేందుకు షెడ్డును నిర్మించాలని సూచించారు. పిప్రి రోడ్డులో వన మహోత్స కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి మొక్కలు నాటారు. ప్రతీఒక్కరు మొక్కలు నాటివాటిని సంరక్షించాలన్నారు. చెట్లు నరికితే భవిష్యత్ తరాలకు హానీ జరుగుతుందని, పండ్లు, నీడనిచ్చే మొక్కలనే నాటి కాపాడుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య శ్రీనివాస్, వైస్‌చైర్మన్ షేక్‌మున్న, మున్సిపల్ కమిషనర్ రాజు, కౌన్సిలర్లు గంగామోహన్‌చక్రు, ఆకుల రాజు, ఇట్టెడి నర్సారెడ్డి, సుంకరి రంగన్న, సర్వసమాజ్ అధ్యక్షుడు ఆకుల రాజు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు

అన్ని రంగాల్లో రాణించాలి

● మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి



విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

బోధన్ రూరల్, జూలై 16: ప్రభుత్వపాఠశాల విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని, కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మశరత్‌రెడ్డి అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని రాకాసిపేట ప్రభుత్వ పాఠశాలతో పాటు సాలూర మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కేవీ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితనోట్ పుస్తకాలతో పాటు విద్యార్థులకు కావాల్సిన వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అన్ని వసతులు, సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రభు రెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

మా భూమిని మాకు ఇప్పించండి

● తహసీల్దార్‌కు వృద్ధ దంపతుల వినతి

నవీపేట, జూలై 16: కబ్జాకు గురైన తమ భూమిని తమకు ఇప్పించాలని మండలంలోని గాంధీనగర్‌కు చెందిన గజ్జ కమలమ్మ, ఎల్లయ్య వృద్ధ దంపతులు మంగళవారం తహసీల్దార్ నారాయణకు వినతిపత్రం సమర్పించారు. లింగాపూర్ పరిధిలోని శాఖాపూర్ శివారులో సర్వేనెంబర్ 289లో 37గుంటలు, సర్వేనెంబర్ 291/1లో ఎకరం 3గుంటలు ఉండగా.. 37 గుంటల భూమిని సిరన్‌పల్లిలోని ఒడ్డెరకాలనీకి చెందిన లక్ష్మణ్ అక్రమించాడని పేర్కొన్నారు. దీనిపై పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని, భూమే జీవనాధారమైన తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

ఒకరిపై అట్రాసిటీ కేసు నమోదు

బోధన్ రూరల్, జూలై1 6: మండలంలోని పెగడాపల్లి గ్రామంలో ఒకరిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. నాగన్‌పల్లి గ్రామానికి చెందిన కొండపల్లి నరేష్ గోసంగి ఫిర్యాదు మేరకు గ్రామంలోని ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఆయన ఫిర్యాదు మేరకు పూర్తి విచారణ చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు. పెగడాపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కౌలుకు పొలం చేస్తున్న కొండపల్లి నరేష్‌ను బూతుమాటలు తిట్టాడని ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు.

వ్యక్తి అదృశ్యం

బోధన్‌రూరల్, జూలై16: మండలంలోని ఊట్‌పల్లి గ్రామానికి చెందిన షేక్ ఖాజా ఈనెల 13న బోధన్‌కు వెళ్లి వస్తానని అదృశ్యమైనట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. అదృశ్యమైన వ్యక్తి భార్య నస్రీన్ బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామని చెప్పారు. సీసీ ఫుటేజీల ద్వారా అన్నికోణాల్లో విచారణ చేపడుతున్నామని త్వరలో ఆచూకీ తెలుసుకుంటామని ఆయన తెలిపారు.

ఉపాధ్యాయేతర పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వేల్పూర్, జూలై 16: వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ గ్రామశివారులోని జాన్కంపేట్ గ్రామం వద్ద ఉన్న కస్తూర్బా విద్యాలయంలో కాంట్రాక్టు పద్ధతిలో ఉపాధ్యాయేతర సిబ్బంది విధులు నిర్వహించడానికి దరఖాస్తులు చేసుకోవాలని మండల విద్యాధికారి వనజారెడ్డి, కేజీబీవీ ప్రత్యేక అధికారిణి వినోద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెడ్‌కుక్ విధులు చేయడానికి పదో తరగతి, అసిస్టెంట్ కుక్, స్వీపర్ విధులు చేయడానికి 7వ తరగతి పాసై ఉండాలని పేర్కొన్నారు. ఎంపికైన వారికి రూ.9750 నెలసరి వేతనం ఉంటుందని తెలిపారు. పోస్టులకు అర్హత ఉండి ఆసక్తి గల మహిళలు జూలై 20 లోపు మండల విద్యాధికారి కేంద్రం (ఎంఆర్‌సీ) వేల్పూర్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

'ముదిరాజ్‌లను బీసీఏలో చేర్చాలి'

ఎడపల్లి, జూలై 16: రాష్ట్రంలో ఉన్న ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చాలని మంగళవారం మండల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఎడపల్లి తహసీల్దార్ ధన్వాల్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు సున్నపు ఒడ్డెన్న మాట్లాడుతూ రాష్ట్రంలో 2014 ఆగస్టు 18, 19 తేదీల్లో చేసిన కుటుంబ సర్వేఆధారంగా వెనుకబడిన తరగతులలో 10శాతం, రాష్ట్రపూర్తి జనాభాలో 13శాతం ఉన్న తమలో కొందరు మత్స్య, తోటల పెంపకం, ఇతర వృత్తులలో జీవనం కొసాగిస్తున్నారని అన్నారు. గత ఎన్నికల మేనిఫెస్టోలో అభయహస్తంలో పేర్కొన్న మాదిరిగా జీవో 15 ప్రకారం ముదిరాజ్‌లను బీసీ ఏకు మార్చాలని కోరారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ధర్నా చేపట్టి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించినట్లు తెలిపారు. ఆయనవెంట ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణ, నాయకులు రాజ్ కుమార్, మనోజ్, అశోక్, నెల్లిరాజు, ఆంజనేయులు, గుండారం సాయిలు, జనార్ధన్ ఉన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

కేశవ స్మృతి మందిరానికి

జాతీయస్థాయిలో గుర్తింపు తెస్తాం

● కందకుర్తి క్షేత్రం అభివృద్ధికి కృషి చేస్తా : ఎంపీ ధర్మపురి అరవింద్



కందకుర్తిలో కేశవ స్మృతి వనాన్ని పరిశీలిస్తున్న ఎంపీ అరవింద్

రెంజల్, జూలై 16: కందకుర్తి త్రివేణి సంగమం క్షేత్రంలోని కేశవ స్మృతి వనానికి జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకువచ్చి కందకుర్తి త్రివేణి సంగమ అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీ ధర్మపురి అరవింద్ పేర్కొన్నారు. మంగళవారం కందకుర్తి గ్రామంలో నిర్మిస్తున్న కేశవ స్మృతివనంతో పాటు స్కంద మందిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్ర పుణ్యక్షేత్రమైన కందకుర్తి త్రివేణి సంగమ క్షేత్రంలో కేశవ స్మృతి వనాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని, కేశవ స్మృతి వనాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దుతామని ఆయన అన్నారు. హెగ్డేవార్ పూర్వీకుల గ్రామమైన కందకుర్తి పుణ్యక్షేత్రంలో కేశవ స్మృతి వనం, స్కంద మందిరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి తీరుతామని అన్నారు. ఆయనవెంట బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యులు వడ్డీ మోహన్ రెడ్డి, మండల అధ్యక్షుడు గోపికృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు మేక సంతోష్, అసెంబ్లీ కన్వీనర్ కూరెళ్ల శ్రీధర్, మాజీ వైస్ ఎంపీపీ యోగేష్, మాజీ ఉపసర్పంచ్ యోగేష్, గోవింద్ ఉన్నారు.

గ్రామాల్లో అమ్మమాట.. అంగన్‌వాడీ బాట



మోర్తాడ్‌లో పిల్లలతో తల్లిదండ్రులు

వేల్పూర్, జూలై16: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని మంగళవారం వేల్పూర్ మండలం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో ప్రారంభించారు. మొదటిరోజు ఆయా గ్రామాలోల అంగన్‌వాడీ టీచర్‌ల ఆధ్వర్యంలో గ్రామాల వీధులగుండా పిల్లలు, తల్లులతో ర్యాలీ నిర్వహించారు. మండలంలోని అంక్సాపూర్ గ్రామంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గంగహంస మాట్లాడారు. మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి వారికి విద్య నేర్పించేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆట వస్తువులు, పౌష్టికాహారం అందించడం జరుగుతుందన్నారు. పిల్లలకు పసిప్రాయం నుంచే అక్షరాభాస్యం చేయించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం కార్యక్రమాన్ని రాష్ట్రప్రభుత్వం చేపట్టిందన్నారు. 15నుంచి 20వ తేదీ వరకు అమ్మమాట అంగన్‌వాడిబాట కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు.

మోర్తాడ్: మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం అమ్మమాట అంగన్‌వాడీపాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పిల్లలు, తల్లిదండ్రులు, అంగన్‌వాడీ టీచర్లు కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ ముద్దు.. ప్రైవేటు వద్దు అంటూ తల్లిదండ్రులు నినాదాలు చేశారు. కా ర్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, సుమన, సులోచన, శారద, గంగజమున, అంజమ్మ ఉన్నారు.



జాన్కంపేట్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



తైక్వాండో పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులు

తైక్వాండో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

ఆర్మూర్‌టౌన్, జూలై 16: హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన రాష్ట్ర తైక్వాండో చాంపియన్‌షిప్‌లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటారు. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా తైక్వాండో చాంపియన్‌షిప్ నిర్వహించగా పట్టణానికి చెందిన రాయల్ తైక్వాండో అకాడమిలోని 11 మంది క్రీడాకారులు సబ్/ఇనియర్, కెడిట్ జూనియర్లు పాల్గొనగా ముగ్గురు స్వర్ణ, నాలుగు రజత, నాలుగు క్యాంస పథకాలు సాధించారని తైక్వాండో అధ్యక్షుడు ప్రవీణ్ తెలిపారు.

ప్రతీ ఇంట్లో మొక్కలు నాటాలి

మోర్తాడ్, జూలై16: మండలంలోని దొన్కల్ గ్రామంలో అంగన్‌వాడీ టీచర్‌లు మంగళవారం మహిళలకు మొక్కలు పంపిణీ చేశారు. గ్రామంలో ప్రతీ ఇంటికి ఐదు మొక్కలు నాటాలని మహిళలను కోరారు. ఈ సందర్భంగా అంగన్‌వాడి టీచర్‌లు మహిళలకు వివిధ రకాల మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.



దొన్కల్‌లో మహిళలకు మొక్కలను పంపిణీ చేస్తున్న దృశ్యం

రైలు కిందపడి యువజంట ఆత్మహత్య



అనిల్, శైలజ (ఫైల్‌ఫొటో)

● బంధువుల దుష్ప్రచారమే కారణమంటూ ఆవేదన

● సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన యువతి

● హెగ్డోలిలో విషాదం

కోటగిరి/నవీపేట్, జూలై 16: కుటుంబ కలహాలు ఓ యువజంట బలవన్మరణానికి కారణమైంది. తనపై బంధువులు చేస్తున్న దుష్ప్రచారాన్ని తట్టుకోలేక మనస్తానికి గురైన యువతి భర్తతో కలిసి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన నవీపేట మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకళ్తే.. పొతంగల్ మండలంలోని హెగ్డోలి గ్రామానికి చెందిన అనిల్ (26), శైలజ (20)లకు రెండేళ్ల క్రితం వివాహమైంది. సాఫీగా సాగుతున్న వీరి జీవితంలో గతంలో యువతి చేసిన చిన్నతప్పు ప్రాణాల మీదికొచ్చింది. తాను ఎలాంటి తప్పూ చేయనని అత్తమామలు, భర్తలకు సర్దిచెప్పుకుంది. అయినా తన పిన్ని తనపై బంధువుల వద్ద దుష్ప్రచారం చేయడంతో తీవ్ర మనస్థాపానికి గురైంది. సోమవారం ఉదయం ఇంటర్వ్యూ పేరుతో భార్యభర్తలు ఇద్దరూ బాసర గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సోషల్‌మీడియాలో శైలజ పోస్ట్‌చేసింది. మృతురాలి బావ పోస్ట్‌ను సోమవారం రాత్రి కోటగిరి ఎస్సై సందీప్‌కు పంపించారు. అప్రమత్తమైన ఎస్సై నవీపేట ఎస్‌ఐకి సమాచారం అందించారు. పోలీసులు బాసర గోదావరి బ్రిడ్జి వద్ద వీరు కోసం గాలించి మొబైల్ నెంబర్‌ను ట్రేస్‌చేశారు. అప్పటికే ఫకీరాబాద్, మిట్టాపూర్ మధ్యలో రైల్వేట్రాక్‌పై ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న రైల్వేపోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను జిల్లా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాపర్, ఆయిల్ చోరీ

కోటగిరి, జూలై 16: పొతంగల్ మండలంలోని కొల్లూర్ గ్రామ శివారులో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రెండు ట్రాన్స్‌ఫార్మర్‌లలో ఆయిల్, కాపర్ వైర్లను చోరీ చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. పొతంగల్ ట్రాన్స్‌కో ఏఈ నర్సారెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్సై ఘటనస్థలాన్ని పరిశీలించారు. 40 కేవీ, 60 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లను పగులగొట్టి రాగివైరు, ఆయిల్ తొగించినట్లు గుర్తించారు. ఏఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ వెల్లడించారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

● రూ.19వేల 390, ఆరు ఫోన్‌లు స్వాధీనం

ఆర్మూర్‌టౌన్, జూలై 16: ఆలూర్ మండలకేంద్రంలో ఏసీపీ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో మంగళవారం పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడి చేసి ఏడుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేశారు. పేకాట ఆడుతున్నట్లు వచ్చిన పక్కా సమాచారం మేరకు దాడి చేసి వారివద్ద నుంచి రూ.19వేల 390లతోపాటు ఆరు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్టు పోలీసులు తెలిపారు. ఈ దాడిలో ఎస్సై అంజమ్మతో పాటు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది లక్ష్మన్, రాములు అనిల్‌కుమార్, నర్సన్న పాల్గొన్నారు.



ఆలూర్‌లో పోలీసులు పేకాట రాయుళ్ల అరెస్టు



నాళేశ్వర్‌లో క్రాప్‌బుకింగ్ నిర్వహిస్తున్న అధికారులు

పంటల సాగు వివరాల నమోదును వేగంగా చేపట్టాలి

● జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజీద్ హుస్సేన్

నవీపేట, జూలై 16: జిల్లాలో వానకాలానికి సంబంధించిన పంటల నమోదు వివరాల ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజీద్ హుస్సేన్ కోరారు. మంగళవారం మండలంలోని నాళేశ్వర్‌లో రైతులు సాగుచేస్తున్న పంటలను పరిశీలించారు. ఏఈవోలు క్రాప్ బుకింగ్ యాప్ ద్వారా రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏవో సురేష్ గౌడ్, ఏఈవో వసంత్, పలువురు రైతులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీపై విజిలెన్స్ విచారణ చేపట్టాలి

● సీఎంకు ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ఫిర్యాదు

ఆర్మూర్ టౌన్, జూలై 16: ఆర్మూర్ మున్సిపాలిటీలో జరిగిన అవినీతిపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి రాత పూర్వకంగా ఫిర్యాదుచేశారు. మున్సిపాలిటీలో అసైన్డ్‌మెంట్ భూములతో పాటు నిబంధనలకు విరుద్ధంగా భూములు, సుమారు 300 ఇంటి నెంబర్లు కేటాయించారని పేర్కొన్నారు. అలాగే పెర్కిట్, పట్టణంలోని ధోబిగల్లీ, జిరాయత్‌నగర్ వెంచర్లలో అవకతవకలు జరిగాయని, అలాగే మున్సిపాలిటీలో మిషన్ భగీరథ వాటర్ పైప్‌లైన్‌తో పాటు గ్రావెల్ వర్క్‌లో తప్పుడు బిల్లులు చేస్తున్నారని, 16 మోటార్ వెహికిల్స్‌లో అవినీతి జరిగిందని తెలిపారు. టీయూఎఫ్‌ఐడీసీ నిధులైన రూ.75లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించి డ్రైనేజీ నిర్మాణం సరిగ్గా చేపట్టనందున నిధులు నష్టపోయామని, దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే స్పందించి విజిలెన్స్ విచారణ చేపట్టాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆవులకు మత్తుమందు!

● అర్ధరాత్రి ఇంజక్షన్లు ఇచ్చి దూడను ఎత్తుకెళ్లిన దుండగులు

ఎడపల్లి, జూలై16: మండల కేంద్రంలోని హనుమాన్ (గ్రామం) ఆవులకు సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు మత్తు ఇంజక్షన్లు ఇచ్చారు. రాత్రి వర్షం పడడంతో గ్రామ ఆవులు మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిద్రించాయి. ఆ సమయంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఇన్నోవా కారులో వచ్చి నిద్రిస్తున్న ఆవులకు మత్తు ఇంజక్షన్ ఇచ్చారని గ్రామస్థులు తెలిపారు. ఆవులు మత్తులోకి వెళ్లే వరకు గ్రామంలో తిరుగు తున్న వీరిని గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు గమనించి వెంబడించగా అప్పటికే ఇన్నోవా వాహనం డిక్కీలో దూడను వేసుకుని ఎత్తుకెళ్లినట్లు యువకులు తెలిపారు. వెటర్నరీ డాక్టర్ సందీప్‌కు సమాచారం ఇవ్వగా ఆయన వెంటనే ఆవులకు చికిత్స చేశారు. మంగళవారం ఉదయం గ్రామ యువకులు పోలీస్‌స్టేషన్‌లో ఆవులను ఎత్తుకెళ్లేందుకు వచ్చిన దండగులను పట్టుకుని శిక్షించాలని ఫిర్యాదు చేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రాళ్లున్న బియ్యాన్ని మార్చేయండి: డీఈవో

నవీపేట, జూలై16: మధ్యాహ్నభోజనానికి సరఫరా అయిన బియ్యంలో రాళ్లు, మెరిగెలతోపాటు ఎలుకల వ్యర్థాలు వస్తున్నాయనే విషయంపై డీఈవో దుర్గాప్రసాద్ స్పందించారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'మధ్యాహ్న భోజన బియ్యంలో రాళ్లు' అనే కథనానికి డీఈవో స్పందించి చర్యలు చేపట్టారు. మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు ఇటీవల సరఫరా అయిన బియ్యంలో రాళ్లు, మెరిగెలు, ఎలుకల వ్యర్థాలు ఉండడంతో అసహనం వ్యక్తం చేస్తూ బియ్యాన్ని మార్చేయాలని, మంచి బియ్యాన్ని పాఠశాలలకు పంపాలని ఎంఈవోను ఆదేశించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కడైనా బియ్యంలో రాళ్లు, వ్యర్థాలు ఉంటే వెంటనే తహసీల్దార్‌లు, సివిల్‌సప్లై అధికారుల సహకారంతో బియ్యాన్ని మార్చుకోవాలని తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

వర్ని, జూలై 16: మండలంలోని డిపోతండా వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు ఎస్సై కృష్ణ కుమార్ తెలిపారు. పిట్లం మండలానికి చెందిన దత్తురెడ్డి, బాన్సువాడకు చెందిన మధుసూదన్ రెడ్డిలు వర్నివైపు ఆల్టో కారు టీఎస్08జీడీ8264 వెళ్తుండగా ఎదురుగా వెళ్తున్న ఐఎస్ యూజడ్‌యూ ఏపీ 39 యూడీ 3168 నంబరు గల వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలిపారు. ఐఎస్ యూజడ్‌యూ వాహనడ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు తెలిపారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించి ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

చేపపిల్లలకు బదులు నగదు ఇవ్వాలని వినతి

కోటగిరి, జూలై16: ప్రభుత్వం మత్స్యకారులకు ఇస్తున్న నాణ్యత లేని చేపపిల్లలకు బదులుగా నగదు అందజేయాలని పొతంగల్ మండల మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు మాగిరి శ్రీనివాస్ కోరారు. పొతంగల్ తహసీల్దార్ మల్లయ్యకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. నాణ్యత లేని చేపపిల్లలతో మత్స్యకారులందరూ నష్టపోతున్నారని అన్నారు. చేపపిల్లలకు బదులు నగదు అందజేస్తే నాణ్యమైన చేపపిల్లలను వేసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘం సభ్యులు మక్కయ్య, గంగారాం, పోశెట్టి, సాయిలు పాల్గొన్నారు.



పొతంగల్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

ఆరోగ్య కేంద్రం ప్రారంభమెప్పుడో?

● అలంకార ప్రాయంగా ఆరోగ్య ఉప కేంద్రాలు ● ప్రారంభానికి ముందే పగుళ్లు.. ● వైద్యం అందుబాటులో లేక ప్రైవేటుకు పరుగులు

ముప్కాల్, జూలై 16: గ్రామీణ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం నిర్మించిన పల్లె దవాఖానాలకు సుస్తి చేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముప్కాల్ మండల కేంద్రంలో రూ.16 లక్షలతో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణానికి 2022 మార్చి 20న మాజీమంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ప్రారంభించిన నాటినుంచి నత్తకే నడక నేర్పిన విధంగా సాగిన పనులు ఎట్టకేలకు పూర్తయ్యాయి. భవననిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలనే సంకల్పంతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలు అలంకారప్రాయంగా మిగిలిపోతున్నాయి. దీంతో అందుబాటులో వైద్యం లేక ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులవైపు పరుగులు తీస్తున్నారు. అప్పులు చేసి మరీ వైద్యం చేసుకున్నా ప్రాణాలు నిలవక అప్పుల పాలవుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పల్లె దవాఖానాలను ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.



దవాఖానలో ఏర్పడిన లీకేజీ

● ప్రారంభానికి ముందే లీకేజీ

లక్షలు వెచ్చించి నిర్మించిన దవాఖానా భవనం ప్రారంభానికి ముందే పగుళ్లు ఏర్పడి నీటి లీకేజీలు ఏర్పడ్డాయి. నాసిరకం పని వల్లే గోడలకు పగుళ్లు ఏర్పడి కొద్దిపాటి వర్షానికే నీరు లీకేజీ అవుతోంది. సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



భవనానికి ఏర్పడ్డ పగుళ్లు



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న దవాఖాన

త్వరలో వైద్యసేవలు ప్రారంభిస్తాం

● రాకేష్, వైద్యుడు

ముప్కాల్‌లో నిర్మించిన పల్లె దవాఖానా సాధ్యమైనంత త్వరగా ప్రారంభిస్తాం. కొద్దిపాటి విద్యుత్ నేటి పనులు పూర్తి కావాల్సిన ఉంది. త్వరగా పూర్తి చేసే ప్రారంభిస్తాం.



హసన్‌టాక్లీలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

అంగన్‌వాడీ కేంద్రాల్లో బాడిబాట

మద్నూర్, జూలై 16: ఉమ్మడి మద్నూర్ మండలంలో అంగన్‌వాడీ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రైవేట్‌కు దీటుగా పూర్వ ప్రాథమిక విద్యను ప్రోత్సహించేందుకు రెండున్నర ఏళ్లు దాటిన చిన్నారులను గుర్తించి అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించేందుకు ఉమ్మడి మద్నూర్ మండలంలోని హసన్‌టాక్లీ, ఎక్లారా గ్రామాల్లో మంగళవారం అమ్మ మాట అంగన్‌వాడీ బాట పేరుతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ డోంగ్రి మండల వర్కర్స్ అధ్యక్షురాలు సచిత మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగానే ర్యాలీలు, సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు రెండున్నర సంవత్సరాలు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించడం, స్వచ్ఛత, పరిశుభ్రత, పూర్వ ప్రాథమిక విద్య ప్రాధాన్యత చిన్నారుల ఆరోగ్య రక్షణ మొక్కలు నాటడం, చిన్నారులకు సామూహిక అధ్యక్ష, అక్షర భ్యాసం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

బీజేపీ జిల్లా కమిటీ ఏర్పాటు

కామారెడ్డి టౌన్, జూలై 16: కామారెడ్డి జిల్లా బీజేపీ కమిటీని ఏర్పాటు చేసినట్లు జిల్లా అధ్యక్షురాలు అరుణతార మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ఉపాధ్యాక్షుడిగా విఠల్, ప్రధాన కార్యదర్శిగా రాము, సెక్రెటరీలుగా క్రిష్ణపటేల్, పోతురాజ్ వెంకట్, కోశాధికారిగా బస్వారెడ్డి, గిరిజనమోర్చా అధ్యక్షుడిగా నవీన్‌నాయక్, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌లుగా రమేష్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రాధాకృష్ణారెడ్డి, గోలి శ్రీనివాస్, స్వరూప, మనోహర్‌రెడ్డి, పరశరాములు, రాజాగౌడ్, పద్మ, ముక్క సురేష్, నరేష్‌రెడ్డి, వెంకట్‌రావు, శ్రీనివాస్, దత్‌రావు, గంగాధర్‌రావు, హనుమండ్లు, భూమాగౌడ్, నర్సింహారెడ్డి, మల్లుదేశాయ్, బండి రాములు, రాజు పటేల్, కాసర్ల రవీందర్‌లతో కూడిన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మెడికల్ షాప్‌లో దొంగతనం

బిచ్కుంద, జూలై 16: మండల కేంద్రంలోని బాలాజీ మెడికల్ షాప్‌లో సోమవారం రాత్రి దొంగతనం జరిగిందని దుకాణ యజమాని తెలిపారు. మంగళవారం ఉదయం మెడికల్‌షాప్ తెరిచేందుకు వెళ్లగా తాళం తీసి ఉందని లోపలికి వెళ్లిచూడగా నగదు చోరీకి గురైందని తెలిపారు. అదేవిధంగా పక్కనే ఉన్న మరో కిరాణ దుకాణంలో షటర్ తాళం తొలగించేందుకు ప్రయత్నించారు. దొంగ తనం విషయంలో పోలీసులకు సమాచారం ఇవ్వగా కేసు నమోదు చేసికొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇటీవల ఎస్‌బీఐ చోరీ మరువక ముందే ఈ రకంగా దొంగతనాలు జరగడంతో వ్యాపారులు ఆందోళనకు గురవుతున్నారు. పోలీసులు పెట్రోలింగ్ చేపట్టక పోవడంతోనే దొంగతనాలు జరుగుతున్నాయని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

హాకీ కిట్ల అందజేత

బీబీపేట, జూలై 16: బీబీపేట మండలంలోని జనగామ గ్రామానికి చెందిన తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి కేరళలో జరిగే ఇండియా సౌత్ జోన్ హాకీ చాంపియన్ షిప్‌కు ఎంపికైన క్రీడాకారులకు హాకీకిట్లను అందించారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ఎల్లప్పుడు ప్రోత్సహిస్తూ వారికి అండగా ఉంటానని తెలిపారు.

సెల్‌ఫోన్‌ల రికవరీలో జిల్లా ప్రథమ స్థానం

కామారెడ్డి టౌన్, జూలై 16: పోగొట్టుకున్న సెల్‌ఫోన్ రికవరీలో తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాల్లో కామారెడ్డి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని ఎస్పీ సింధూశర్మ తెలిపారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా జిల్లాలో ఈ సంవత్సరం మొదటి నుంచి జూన్ నెల వరకు 450 ఫోన్‌లను రికవరీ చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో సెల్‌ఫోన్ రికవరీలో బాన్సువాడ పోలీసుస్టేషన్ మొదటి స్థానంలో ఉందని తెలిపారు. మొదట మొబైల్ ఫోన్ కోల్పోయిన వ్యక్తి వెంటనే కోల్పోయిన ఫోన్‌లో ఉన్న సిమ్ కార్డుబ్లాక్ చేయించి కొత్త సిమ్‌కార్డు తీసుకోవాలని, పోలీసుస్టేషన్ వచ్చి దరఖాస్తు ఇస్తే రిసిప్ట్ ఇస్తారని తెలిపారు. ఈ రిసిప్ట్ ద్వారా ఆధార్, కోల్పోయిన ఫోన్ ఐఎంఈఐ నెంబర్‌తో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను బ్లాక్ చేయవచ్చని తెలిపారు. ఫోన్ దొరికిన వ్యక్తి మొబైల్ సిమ్‌కార్డు వేయడానికి ప్రయత్నిస్తే ఈ సిమ్‌కార్డ్ యొక్క డిటెయిల్స్ సీఈఐఆర్ ట్రెసబిల్టి రిపోర్టుతో పాటు మీరు ఇచ్చిన మొబైల్ నెంబర్‌కు మెసేజ్ వస్తుందని తెలిపారు. ఈ నెంబర్‌ను తీసుకుని పోలీసుస్టేషన్‌కు వస్తే వారిని పట్టుకుని రికవరీ చేసి బాధితులకు అప్పగిస్తారని తెలిపారు.

‘ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి చేర్చాలి’

బాన్సువాడ టౌన్, జూలై 16: ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏలో చేర్చాలని బాన్సువాడ ముదిరాజ్ సంఘ సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో రమేశ్‌రాథోడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ముదిరాజ్‌ల సమస్యను పరిష్కరించాలన్నారు. ముదిరాజ్‌లను బీసీ ఏలోకి మార్చితే న్యాయం చేకూర్చినట్లు అవుతుందన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

● అక్కడికక్కడే ఒకరి మృతి.. ఆరుగురికి గాయాలు

భిక్కనూరు, జూలై 16: శుభకార్యానికి హాజరై తిరిగి తన కారులో స్వగ్రామానికి వెళ్తుండగా 44వ జాతీయ రహదారిపై ఆగిఉన్న లారీని వెనుకాల నుంచి ఢీకొట్టడంతో కారు నుజ్జునుజ్జై ఒకరు తీవ్రగాయాలతో అక్కడిక్కడే మృతి చెందగా కారులో ఉన్న ఆరుగురికి గాయాలైన సంఘటన భిక్కనూరు మండలంలోని సిద్ధరామేశ్వరనగర్ గ్రామ సమీపంలో మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. భిక్కనూరు ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన బ్రహ్మారౌత్ శివకుమార్ వర్మ(34) హైదరాబాద్‌లోని తన బావమరిది శ్రీకాంత్‌వర్మ ఇంట్లో జరిగిన శుభకార్యానికి తన భార్య రవళి, కుమారుడు శివానంద్, కూతురు ఆరాధ్య, స్నేహితులు కన్నుల అరుణ్(ముప్కాల్), మంతెన సాయిరెడ్డి(ముచ్చర్ల), బర్దవాల్ శివకుమార్(గోరటికల్)తో కలిసి హాజరై తిరిగి స్వగ్రామం నిర్మల్‌కు వస్తుండగా మండలంలోని సిద్ధరామేశ్వరనగర్ గ్రామ శివారులోని సురేష్‌దాబా సమీపంలో ఆగిఉన్న లారీని వెనుకాల నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు లారీ కిందికి సగ భాగం వరకు వెళ్లగా కారులో ఇరుక్కుపోయి తీవ్రగాయాలై శివకుమార్‌వర్మ అక్కడిక్కడే మృతి చెందాడు. కారులో ఉన్న మృతుడి భార్య రవళి, కుమారుడు శివనాంద్, కూతురు ఆరాధ్య, స్నేహితులు అరుణ్, సాయిరెడ్డి, శివకుమార్‌కు గాయాలయ్యాయి. గాయపడిన వీరిని కామారెడ్డికి 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం తరలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా గాయపడిన వారిని పరీక్షించిన వైద్యులు తీవ్రంగా గాయపడిన శివకుమార్‌ను మెరుగైనా చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. మృతుడి మామ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



మృతి చెందిన శివకుమార్‌వర్మ



గాయపడిన వారిని 108 లో తరలిస్తున్న దృశ్యం



ప్రమాదంలో లారీ కిందకి దూసుకెళ్లిన కారు

నుజ్జునుజ్జయిన కారు..

ఈ ప్రమాదంలో కారు లారీ కిందికి చాలా వరకు వెళ్లడంతో కారు సగ భాగానికి పైగా నుజ్జునుజ్జైంది. సమాచారం అందుకున్న పోలీసులు, జీఎంఆర్, 108 సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని కారులో వెనుక భాగంలో ఉన్న వారిని అతికష్టం మీద బయటకు తీయగా మృతుడు శివకుమార్‌వర్మను చాలా సమయం వరకు బయటకు తీయడం సాధ్యం కాలేదు. దీంతో క్రేన్ సహాయంతో లారీ కింద ఇరుక్కుపోయిన కారును బయటకు తీసి కారులో నుంచి మృతదేహాన్ని బయటకు తీశారు.

పంటలను పరిశీలించిన వ్యవసాయాధికారులు



రాజంపేటలో పంటలను పరిశీలిస్తున్న సుప్రజ్యోతి

రాజంపేట, జూలై 16: మండల కేంద్రంలో మంగళవారం వ్యవసాయ పంటలను పరిశీలించినట్లు మండల వ్యవసాయ అధికారి సుప్రజ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వానాకాలంలో సాగు చేసిన పంటల యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. సోయాబిన్ పంటలో ఆశించే పురుగులైన బీహర్ గొంగళి పురుగు, శనగ పచ్చ పురుగు నివారణ చర్యలు రైతులకు తెలిపారు. నివారణకు క్లోరిపైరిపాస్ 1.5లీటర్లు ఒక ఎకరాకు పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీకాంత్, గ్రామరైతులు పాల్గొన్నారు.

కామారెడ్డి టౌన్: ఎర్రపహాడ్‌లో మంగళవారం వ్యవసాయ శాస్త్రవేత్తలు పంటలను పరిశీలించారు. సోయాబిన్ పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరించారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు ఉధృతి గమనించి దీని నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కత్తెర పురుగు నివారణకు ఇమామ్యాక్టిన్ బెంజైయిట్ అనే మందులను పిచికారీ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి వ్యవసాయ సహాయ సంచాలకులు వీరస్వామి, శాస్త్రవేత్తలు అనిల్‌రెడ్డి, రేవంత్, ఏవో శ్రీకాంత్, ఏఈవో రాకేష్, రైతులు వెంకట్‌రావు, భాస్కర్, రాజు, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్ద కొడప్‌గల్: మండలంలోని కాటేపల్లి శివారులో మంగళవారం వ్యవసాయధికారులు పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా బిచ్కుంద ఏడీఏ లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ రైతులు తాము సాగు చేసిన పంటలను ఆన్‌లైన్‌లో పరిశీలించామన్నారు. గతంలోనే తమ సిబ్బంది రైతులు సాగు చేసిన పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారని తెలిపారు. దీంతో పాటుగానే ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేస్తున్న పంటలకు సంబంధించిన తెగులు వస్తే నివారణ చర్యలు ఏం తీసుకోవాలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రూప, రైతులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మద్నూర్, జూలై 16: మండల కేంద్రంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. మండల కేంద్రంలోని స్వామి అనే వ్యక్తి ఇంట్లో దొంగతనం జరిగి 12 తులాల వెండి నాణేలు ఒక గ్రాము బంగారు విగ్రహం, 1200 నగదు అపహరించుకుపోయినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పంచనామా నిర్వహించి దర్యాప్తు చేస్తున్నామని కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సుధాకర్ వెల్లడించారు.

రేషన్ డీలర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

● ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్

ఎల్లారెడ్డి, జూలై 16: ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలోని ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, లింగంపేట మూడు మండలాల్లో వివిధ గ్రామాల్లో ఖాళీగా ఉన్న ఎనిమిది రేషన్‌డీలర్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్లు మంగళవారం ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎల్లారెడ్డి మండలంలో తిమ్మారెడ్డి, జన్కంపల్లి కుర్దు, నాగిరెడ్డిపేట మండలంలోని గోలి లింగాల, వదల్‌పర్తి, జలాల్పూర్, తాండూర్, మాల్తుమ్మెద, లింగంపేట మండలంలోని పోల్కంపేట్ గ్రామాల్లో ఖాళీ ఉన్న రేషన్ డీలర్ల నియామకం కోసం ఆసక్తి గల వారు దరఖాస్తులు ఈనెల 30వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు ఎల్లారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారులు వయసు 18 నుంచి 40 సంవత్సరాల లోపు ఉండాలని తెలిపారు.

వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రామారెడ్డి, జూలై 16: రామారెడ్డి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఎస్సీ వసతి గృహంలో విద్యార్థుల ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వసతి గృహ సంక్షేమాధికారి జైపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహంలో మూడో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు 30 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

● ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్

ఎల్లారెడ్డి, జూలై 16: మండలంలోని మాచాపూర్ గ్రామంలో మంగళవారం ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్, ఎంపీవో ప్రకాష్ వన మహోత్సవం సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటిన మొక్కలను రక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని అన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పనులను పరిశీలించారు. పనులు సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు.

కాలభైరవస్వామికి ప్రత్యేక పూజలు



రామారెడ్డి, జూలై 16: రామారెడ్డి మండలం ఇస్సన్నపల్లి-రామారెడ్డి గ్రామాల మధ్య వెలసిన కాల భైరవ స్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారికి సింధూర పూజలు నిర్వహించారు. స్వామి పర్వదినం కావడంతో పురోహితులు శ్రీనివాస్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య భైరవునికి క్షీరాభిషేకం, సింధూర పూజలు, అర్చనలు, హారతి వంటి పూజ కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం స్వామి వారి సన్నిదానంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ బుర్ల ప్రభురాంచంద్రం గుప్తా, జూనియర్ అసిస్టెంట్ సురేందర్‌గుప్తా, పురోహితులు తదితరులు పాల్గొన్నారు.

‘పోచారంపై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదు’

బాన్సువాడ, జూలై 16 : మాజీ స్పీకర్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డిపై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని మాజీ జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎంపీటీసీ దేవి కృష్ణప్రసాద్ అన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకుడు పాత బాలు, యలమంచిలి శ్రీనివాస్‌రావు అనవసరంగా ఎమ్మెల్యే పోచారంపై కాసుల బాలరాజుపై విమర్శలు చేస్తే మీకు ప్రజలే బుద్ధి చెబుతారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 15 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ జెండా మోస్తున్న బాల్‌రాజ్ ఎమ్మెల్యే టికెట్ వద్దు అన్నారు. పార్టీ అధిష్టానం రవీందర్‌రెడ్డికి ఇచ్చింది. కార్యకర్తగా మీరందరూ పార్టీ అధిష్టానం పని చేశారు. అదే అధిష్టాం బాలరాజుకు రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్ చేయాలని చెప్పారు. అది గుర్తుంచుకో మరి మీరు తెలుసా? పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ రావడం మూలాన కాంగ్రెస్ పార్టీలో బలోపేతం అయింది. తప్ప ఎలాంటి నష్టం జరగలేదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేశాయిపేట కె.రత్నాకర్, సంగమేశ్వర్ కాలనీ యూత్ అధ్యక్షుడు షేక్ మౌలా, ఆటో యూనియన్ నాయకులు చింతల దత్తు గుప్త, బీఆర్ఎస్ నాయకులు గంగరాపు కిరణ్‌కుమార్, మాజీ వార్డు సభ్యులు జహీరుద్దీన్, రైస్, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా మారిన గ్రామసభ

● సమస్యలపై అధికారుల నిలదీత

బీర్కూర్, జూలై 16 : బీర్కూర్ గ్రామ పంచాయతీలో మంగళవారం నిర్వహించిన గ్రామసభ రసాభాసగా మారింది. గ్రామంలో నెలకొన్న సమస్యలపై బీజేపీ నాయకులు అధికారులను అడుగడుగునా నిలదీశారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయితీలో స్పెషల్ ఆఫీసర్ లత అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. అయితే గ్రామస్తులు, బీజేపీ నాయకులు బీర్కూర్‌లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. వర్షాకాలం నేపథ్యంలో మురికి కాలువలు అస్తవ్యస్తంగా మారాయని, దోమల బెడద తీవ్రంగా ఉందన్నారు. మురికి కాలువలను శుభ్రపరచడంతో పాటు పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. పీహెచ్‌సీలో పాము కాటు టీకా అందుబాటులో ఉంచాలన్నారు. గ్రామంలో పిచ్చి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని, వాటిని నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. వ్యాధులు ప్రబలకుండా వాటర్ ట్యాంకులను 15 రోజులకు ఒకసారి శుభ్రపరచాలన్నారు. గత సంవత్సరం తైబజార్ పాడని వ్యక్తి నుంచి డబ్బులు రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలపై మాట్లాడుతుండగా బీజేపీ, కాంగ్రెస్ నాయకులు వాగ్వివాదానికి దిగారు. దీంతో గ్రామసభ రసాభాసగా మారింది. సమస్యలను పరిష్కరిస్తామని అధికారులు హామీనిచ్చారు.

ఉపాధ్యాయుల కొరత తీర్చాలని వినతి

పెద్ద కొడప్‌గల్, జూలై 16: జుక్కల్ మండలంలోని ఉన్నత పాఠశాల ల్లో నెలకొని ఉన్న ఉపాధ్యాయుల కొరత తీర్చాలంటూ మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థి సంఘ నేతలు ఎంఈవో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జుక్కల్ ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు పిర్దోస్ మాట్లాడుతూ జుక్కల్ మండలంలోని జుక్కల్, కౌలాస్, పెద్దఏడ్గి, హంగర్గ, ఖండెబల్లూర్ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందని విన్నవించారు. గతంలో ఈ పాఠశాలల్లో పని చేసిన ఉపాధ్యాయులు బదిలీ కాగా, వారి స్థానంలో కొత్తవారు వచ్చి జాయిన్ అయి తిరిగి వెళ్లిపోయారని తెలిపారు. దీంతో పాఠశాల ప్రారంభం అయి నెల రోజులకు పైగా అయినప్పటికి విద్యార్థులకు పాఠాలు బోధించే ఉపాధ్యాయులు లేక విద్యాబోధన కుంటుపడిందని తెలిపారు. ఇప్పటికైన జిల్లా ఉన్నతాధికారులు స్పందించి జుక్కల్ మండలంలోని ఆయా ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించాలని లేదంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



దోమకొండలో ఆస్పత్రిని పరిశీలించిన కాయకల్ప బృందం సభ్యులు

దోమకొండ ఆస్పత్రిని పరిశీలించిన కాయకల్ప బృందం

దోమకొండ, జూలై 16: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని మంగళవారం కాయకల్ప బృందం సభ్యులు అమీర్‌సింగ్, శ్రీనివాస్, శ్రీదేవి పరిశీలించారు. ఆసుపత్రిలో దంతవైద్య గది, స్కానింగ్ గది,ల్యాబ్, డ్రెస్సింగ్ గది, మందుల గది, ఎక్సరే రూం, ఎమర్జెన్సీ గదులను పరిశీలించారు. వేర్వేరుగా సిస్టర్‌లను వారు రోగులకు చేస్తున్న చికిత్సల పట్ల ఎలాంటి రోగులకు ఏ విధంగా చికిత్స చేస్తారనేది సిబ్బందిని ప్రశ్నించారు. అందుకు సిబ్బంది వారి విధులు, వివిధ రకాల రోగులకు ఎవరికి ఎలాంటి చికిత్స అందించానే వివరాలను బృందం సభ్యులకు తెలిపారు. అనంతరం మహిళ వార్డు,పురుషుల వార్డులను తనిఖీ చేశారు. చెత్త బుట్టలు, వాటర్ ట్యాబ్‌లను పరిశీలించారు. వాటర్ ట్యాంకులు ఎన్ని రోజులకొకసారి క్లినింగ్ చేస్తారనేది అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు వెంకటేశ్వర్లు, దివ్య, పద్మావతి, సురేఖ, శ్రీవాణి, హైందవి, మీనా, దీక్షిత్, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో గ్రీన్ డే వేడుకలు

దోమకొండ, జూలై 16: మండల కేంద్రంలోని శ్రీ వాసవి స్కూల్‌లో మంగళవారం గ్రీన్‌డే కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. చదువుల తల్లి సరస్వతీ దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. విద్యార్థులు వివిధ రకాల అక్టివీటిస్ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రవీందర్, ఉపాధ్యాయులు రాంచంద్రం, నవిత, జ్యోతి, మమత, స్వప్న, జ్యోతి పాల్గొన్నారు.

దోమకొండలో అమ్మమాట ర్యాలీ

దోమకొండ, జూలై 16: మండల కేంద్రంలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాల్లో సూపర్‌వైజర్ నిర్మల ఆధ్వర్యంలో మంగళవారం అమ్మమాట-అంగన్‌వాడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో కొత్త పాఠ్య ప్రణాళిక ప్రవైటు పాఠశాలలకు దీటుగా పిల్లలకు ఆటపాటలతో విద్య నేర్పిస్తున్నట్లు తెలిపారు. వివిధ అంశాలపై తల్లులకు గ్రామస్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశాలు పాల్గొన్నారు.

అక్రమ మద్యాన్ని సరఫరా చేస్తే కఠిన చర్యలు

భిక్కనూరు, జూలై 16: అక్రమ మద్యాన్ని సరఫరా చేసినా విక్రయించిన కఠిన చర్యలు తప్పవని దోమకొండ ఎక్సైజ్ సీఐ మధుసూదన్‌రావు హెచ్చరించారు. మంగళవారం సాధారణ తనిఖీల్లో భాగంగా దోమకొండ ఎక్సైజ్ సీఐ ఆధ్వర్యంలో మండలంలోని టోల్‌ప్లాజా వద్ద సిబ్బంది వాహనాల తనిఖీ, మండలంలోని 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న దాబాల్లో తనిఖీలు, మండలంలోని రామేశ్వర్‌పల్లి కల్లు దుకాణంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ దాబాల్లో సిట్టింగులు నిర్వహించిన, మద్యం విక్రయించిన, మద్యాన్ని సరఫరా చేసిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సుదర్శన్, సిబ్బంది శ్రీనివాస్, బాల్‌రాజు, అపూర్వ, పావని తదితరులు పాల్గొన్నారు.

‘కల్తీ కల్లు విక్రయిస్తున్నా.. చర్యలు తీసుకోవడం లేదు’

భిక్కనూరు, జూలై 16: మండలంలో చాలా కల్లు దుకాణాల్లో కల్తీ కల్లు విక్రయిస్తున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని భిక్కనూరు పట్టణానికి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు దోమకొండ ఎక్సైజ్ పోలీసులను మంగళవారం ప్రశ్నించారు. భిక్కనూరుకు వచ్చిన ఎక్సైజ్ సీఐ మధుసూదన్‌రావు, సిబ్బందితో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు శంకర్, లక్ష్మణ్, ప్రతినిధులు డప్పు మాట్లాడుతూ మండలంలోని కల్తీ కల్లు తాగి చాలా మంది అనారోగ్యం పాలవుతున్నారని, ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో పాటు మండలంలో కల్తీ కల్లు సమస్య లేదని అనడం సమంజసం కాదన్నారు. భిక్కనూరులో చాలా గ్రామాల్లో యథేచ్ఛగా కల్తీకల్లు విక్రయిస్తున్నారని అన్నారు. వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని, ఈ విషయమై ఎక్సైజ్ ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థిని

మద్నూర్, జూలై 16 : డోంగ్లి మండల పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి లక్ష్మీ అనే విద్యార్థిని బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యార్థులను సిద్ధం చేస్తున్నామని ఆయన వెల్లడించారు. డోంగ్లి మండలం నుంచి ఎంపికైన విద్యార్థికి గ్రామస్థులు అభినందించారు. మారుమూల డోంగ్లి మండలం నుంచి విద్యార్థిని లక్ష్మీ ఎంపిక కావడంతో వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు కృతజ్ఞత తెలిపారు.

నాటిన మొక్కలను పోషిస్తేనే హరితహారానికి గౌరవం

● కేంద్ర ప్రభుత్వ డిప్యూటీ సెక్రెటరీ కరుణాకరన్



సదాశివనగర్‌లో మొక్కలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

సదాశివనగర్, జూలై 16: నాటిన మొక్కలను పెంచి పోషిస్తేనే హరితహారానికి గౌరవం దక్కుతుందని కేంద్ర ప్రభుత్వ డిప్యూటీ సెక్రెటరీ కరుణాకరన్ అన్నారు. మంగళవారం సదాశివనగర్‌లో అవెన్యూ ప్లాంటేషన్ ఈత వనాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వాతావరణ కాలుష్య నివారణ జరిగి ప్రజలకు మంచి ఆక్సిజన్‌తో పాటు చల్లని నీడను, మంచిఫలాలు దక్కాలని హరితహారం వనమహోత్సవ కార్యక్రమాలను చేపడుతుందని తెలిపారు. కొన్ని గ్రామాల్లో అనేక మొక్కలు ఎండిపోవడం ఎదిగిన మొక్కలను నరికి వేయడం వాటిపై దృష్టి సారించి బాధ్యులపై చర్యలు చేపట్టే విధంగా అధికారుల పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. పది సంవత్సరాల నుంచి మొక్కలు నాటినప్పటికీ ఎంత శాతం పచ్చదనం పెరిగిందన్న విషయాన్ని అధికారులు గమనించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్‌కుమార్, డీఆర్‌డీఏ ఏపీడీ వామన్‌రావు, ఫైనాన్స్ మేనేజర్ రామ్‌నారాయణ, డీఆర్‌పీ హరి, సురేందర్, ఎంపీవో సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి	
శాంతి	ఓసీ
దర్శన్	భారతీయుడు-2
ప్రియా 70	కల్కి
ప్రియా 35	భారతీయుడు-2

బాన్సువాడ	
మహేశ్వరి	భారతీయుడు-2
వెంకటేశ్వర	మహారాజ

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	160	200	220
వెన్‌కాబ్(కిలో)	170	220	230

